క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కుమురంభీం చౌక్, దస్నాపూర్, ఎన్‌జీవో కాలనీ, కంత కాలనీ, హైకాజీనగర్ ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ ఫిరోజ్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త విద్యుత్ లైన్ ఏబీ స్విచ్ నిర్మాణ పనులు చేపడుతున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

'కారోబార్లకు ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి'

కెరమెరి: పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కారోబార్లకు వెంటనే క్షమాపణలు చెప్పాలని కారోబార్ల సంఘం జిల్లా అధ్యక్షుడు గద్దల వెంకటేశ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం అసెంబ్లీలో కారోబార్లను కించపరిచే విధంగా ధర్మారెడ్డి మాట్లాడారన్నారు. క్షమాపణలు చెప్పకుంటే జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

వాలీబాల్ కిట్ పంపిణీ



వాలీబాల్ కిట్ అందజేస్తున్న ఎస్సై విజయ్

పెంచికల్‌పేట్: మండలంలోని అగర్‌గూడ గ్రామంలో యువకులకు శనివారం వాలీబాల్ కిట్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ యువత చదువుల్లో, ఆటల్లో రాణించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి గ్రామాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లడానికి తమ వంతు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

పరిహారం పంపిణీ

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్లూర్ గ్రామంలో రైతు పోషన్నకు చెందిన గేదె గత ఏడాది విద్యుత్ షాక్‌తో మృతి చెందగా బాధిత రైతుకు విద్యుత్ శాఖ నుంచి రూ.40వేల చెక్కు మంజూరైంది. కాగా శనివారం ఏఈ అంజన్‌కుమార్ చెక్కును బాధిత రైతుకు అందజేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చౌదరి తిరుపతి, కోఆప్షన్ సభ్యుడు సాజిద్, నాయకులు సత్యనారాయణ, రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఘనంగా వేదమందిర్ వార్షికోత్సవం



కొనసాగుతున్న ప్రవచన కార్యక్రమం

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని నజ్రుల్‌నగర్ గ్రామపంచాయతీలోని వేద మందిర్ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా శనివారం హోమం నిర్వహించారు. అనంతరం ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో ఆచార్య బృహదత్తాజీ ప్రవచన కార్యక్రమాలను నిర్వహించారు. ఆదివారం వార్షికోత్సవ కార్యక్రమాలు ముగుస్తాయి. కార్యక్రమాల్లో ఆర్యసమాజ్ నాయకులు, బెంగాలీలు పాల్గొన్నారు.

నేడు కౌటాలలో మెగా వైద్య శిబిరం

కౌటాల: మండల కేంద్రంలోని నజరేత్ మిషన్ ప్రైవేట్ ఆసుపత్రిలో నేడు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిబిరం నిర్వహిస్తామన్నారు. ఇందులో చిన్న పిల్లలు, స్త్రీలు, దంత సమస్యలు, చర్మ వ్యాధులు, కీళ్ల వ్యాధులు, బీపీ, షుగర్, క్యాన్సర్ పరీక్షలు, ఇతర వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు అందిస్తారని తెలిపారు. సమీప గ్రామాల ప్రజలు ఉచిత మెగా మెడికల్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

శివాజీ జయంతి ఘనంగా నిర్వహించాలి

చింతలమానెపల్లి: ఈనెల 19న శివాజీ జయంతిని ఘనంగా నిర్వహించాలని ఆరెకుల సంఘం మండల అధ్యక్షుడు టోంబ్రె శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని బాలాజీ అనుకోడ రైతువేదికలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 15న రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో నిర్మించతలపెట్టిన ఆరెకుల భవన నిర్మాణం శంకుస్థాపన కార్యక్రమానికి ఆరె కులస్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు. అనంతరం నూతన గ్రామ కమిటీ అధ్యక్షులు, ఆరెకుల పత్రికా విలేకరులను ఘనంగా సన్మానించారు. సంఘం నాయకులు, ఎంపీపీ దుబ్బుల నానయ్య, దుబ్బుల వెంకన్న, మారుతి, ఆయా గ్రామకమిటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

'అప్‌గ్రేడ్' అయ్యేదెప్పుడో..?

- పీహెచ్‌సీ స్థాయి పెరగక అందని మెరుగైన వైద్యసేవలు
- దూర ప్రాంతాలకు వెళ్లేలోపు విషమిస్తున్న ఆరోగ్య పరిస్థితులు
- సీహెచ్‌సీగా మార్చాలని మండలవాసుల డిమాండ్



రెబ్బెన మండల కేంద్రంలోని పీహెచ్‌సీ

రెబ్బెన: గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన ప్రభుత్వ వైద్యం అందించాలనే లక్ష్యం నీరుగారిపోతోంది. పల్లె దవఖానాలపై ప్రభుత్వం దృష్టి పెడుతున్నా ఇప్పటికే ఉన్న పీహెచ్‌సీల స్థాయిని పెంచడాన్ని మాత్రం విస్మరిస్తోంది. అత్యవసర పరిస్థితుల్లో పీహెచ్‌సీకి వచ్చే రోగులకు కేవలం ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యసేవల కోసం దూర ప్రాంతాల్లోన్ని ప్రభుత్వ ఆసుపత్రులకు రెఫర్ చేస్తుండగా పరిస్థితి విషమించి ప్రాణాల మీదకు వస్తోంది. రెబ్బెన పీహెచ్‌సీని సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేసేందుకు అన్ని అర్హతలు ఉన్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవటంతో ప్రజలు మెరుగైన వైద్యానికి దూరమవుతున్నారు.

రోగుల తాకిడి అధికమే..

మండల కేంద్రంలోని పీహెచ్‌సీ పరిధిలో 24 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రతీరోజు సుమారు 100 మంది వరకు రోగులు ఆసుపత్రికి వస్తుంటారు. సోమ, శుక్రవారాల్లో ఓపీ సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుంది. సీజనల్ సమయంలో ఆసుపత్రి ఓపీ 100 దాటుతుంది. దీంతోపాటు నెలకు 15 నుంచి 20 వరకు ప్రసవాలు జరుగుతుంటాయి. అయినా అధికారులు ప్రస్తుత పీహెచ్‌సీని సీహెచ్‌సీగా మార్చేందుకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. మంచిర్యాల -చంద్రపూర్ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో క్షతగాత్రులను పీహెచ్‌సీకి తరలిస్తే సిబ్బంది కేవలం ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం సుమారు 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న బెల్లంపల్లి, ఆసిఫాబాద్‌లలోని ఆసుపత్రులకు రెఫర్ చేస్తున్నారు. దూర ప్రాంతాల్లో ఉన్న ఆసుపత్రులకు చేరేలోపు క్షతగాత్రుల పరిస్థితి మరింత విషమంగా మారుతోంది. సకాలంలో అందుబాటులో మెరుగైన వైద్యం లేక ప్రాణాలు సైతం గాలిలో కలిసిపోతున్నాయి.

సీహెచ్‌సీకి అన్ని అర్హతలు..

రెబ్బెనలో ప్రస్తుతం ఉన్న పీహెచ్‌సీని సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేసేందుకు అన్ని అర్హతలు ఉన్నప్పటికీ అధికారులు ఆ దిశగా ముందడుగు వేయడం లేదు. గతంలో ఆసుపత్రి సందర్శనకు వచ్చిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేల దృష్టికి విషయాన్ని తీసుకురాగా ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. సాధారణంగా 30వేల లోపు జనాభా ఉంటే పీహెచ్‌సీని ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం మండల జనాభా 37వేలు ఉండటంతో పెరిగిన జనాభాకు అనుగుణంగా పీహెచ్‌సీని సీహెచ్‌సీగా మార్చాల్సిన అవసరం ఉంది. నిత్యం ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించటంతో పాటు క్షేత్రస్థాయిలో వ్యాక్సినేషన్ ఇతర కార్యక్రమాలను పరిశీలించేందుకు కేవలం ఒక్క డాక్టర్ మాత్రమే ఉండటంతో తీవ్రపని భారం పడుతోంది. సీజనల్ సమయంలో రోగుల తాకిడి అధికంగా ఉండే సమయంలో పరిస్థితి మరీ దారుణంగా మారుతోంది. పీహెచ్‌సీ కావటంతో కేవలం 4 పడకలు మాత్రమే అందుబాటులో ఉండగా సరిపోవటం లేదు. పీహెచ్‌సీని సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేస్తే వైద్య సిబ్బంది పెరగటంతో పాటు ఆసుపత్రిలో పడకల సంఖ్య పెరిగి మెరుగైన వైద్య సేవలు అందే అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు ఆ దిశగా దృష్టి సారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రోగుల తాకిడి అధికంగా ఉంది

రెబ్బెన పీహెచ్‌సీకి రోగుల తాకిడి అధికంగా ఉంటుంది. సాధారణ రోజుల్లో 80 మంది వరకు, సోమ, శుక్రవారాల్లో 100కు పైగా మంది రోగులు ఆసుపత్రికి వస్తుంటారు. ఆసుపత్రిలో ఒక్క డాక్టర్‌నే ఉండడంతో రోగులను చూడటం, వ్యాక్సినేషన్ వంటి కార్యక్రమాలు చేపట్టడం కష్టమవుతోంది. మరో డాక్టర్‌ను నియమిస్తే బాగుంటుంది. ప్రస్తుతం నెలకు 3000 వరకు ఓపీ 350 వరకు డెలివరీలు చేస్తున్నాం. సీహెచ్‌సీగా ఏర్పాటు చేస్తే రోగులకు మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు ఆస్కారం ఉంటుంది.

– సుజిత్, వైద్యాధికారి

కొత్త జీపీ భవనాలు నిర్మించరూ..!



శిథిలావస్థకు చేరిన సుర్దాపూర్ పంచాయతీ భవనం

- పాత గ్రామ పంచాయతీ భవనాల్లోనే కార్యక్రమాలు
- 10 జీపీలకు నూతన భవనాల మంజూరు
- ఒక్కో పంచాయతీకి రూ. 20లక్షలు
- గత నెలలోనే ఉత్తర్వులు
- ఇప్పటికీ ప్రారంభం కాని పనులు
- బిల్లుల జాప్యమే కారణమా..?

కెరమెరి: ఎన్నో ఏళ్లుగా గ్రామ పంచాయతీలకు పక్కా భవనాలు లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గ్రహించిన రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు నిధులు మంజూరు చేసింది. నిధులు మంజూరై నెల రోజులు గడుస్తున్నా ఇప్పటికీ మండలంలో ఎక్కడా భవన నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. గత నెల 7న ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ కాగా ఇప్పటి వరకు ఎక్కడా కనీసం భూమిపూజ కూడా కాకపోవడం గమనార్హం. కాగా మండలంలోని పాత గ్రామ పంచాయతీలతో పాటు నూతనంగా ఏర్పడ్డ పంచాయతీలకు సైతం నిధులు మంజూరయ్యాయి.

ఒక్కో జీపీకి రూ.20 లక్షలు

మండలంలో మొత్తం 31 గ్రామ పంచాయతీలు ఉండగా.. కెరమెరి, సాంగ్వి, కొఠారి మినహా ఇతర ఏ పంచాయతీకి పక్కా భవనాలు లేవు. కొన్ని గ్రామాల్లో పాఠశాలల్లో పంచాయతీలు నిర్వహిస్తుంటే, మరి కొన్ని గ్రామాల్లో ఇళ్లల్లో, అద్దె భవనాల్లో గ్రామ పంచాయతీలు కొనసాగుతున్నాయి. ఆగర్‌వాడ, అంతాపూర్, బాబేఝరి, బోరిలాల్‌గూడ, గోండ్‌గూడ, ఝరి, కెస్లాగూడ, ముకదంగూడ, రింగన్‌ఘాట్, తుమ్మగూడ గ్రామ పంచాయతీలకు నూతన భవనాలు మంజూరయ్యాయి. ఒక్కో భవన నిర్మాణం వ్యయం రూ.20 లక్షలు కాగా ఉపాధిహామీ పథకం ద్వారా వీటి నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో లేబర్ కంపోనెంట్ ద్వారా సమకూర్చిన మెటీరియల్ కంపోనెంట్ నిధులతో ఈ భవనాలు నిర్మించనున్నారు.

'ఉపాధి' హామీ నిధులు కావడంతో..

ఉపాధిహామీ పథకంలో భాగంగా గ్రామ పంచాయతీ భవనాలు మంజూరు కావడంతో నిర్మాణానికి ఎవరూ ముందుకు రావడం లేదు. పనులు చేసినప్పటికీ అధికారులు నిధుల మంజూరులో తీవ్రంగా జాప్యం చేస్తారని పలువురు పేర్కొంటున్నారు. సొంత ఖర్చులతో భవనాలు నిర్మించి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తుందని, అయినా డబ్బులు సకాలంలో చేతికి రావన్న కారణంతోనే సర్పంచ్‌లు జీపీ భవనాల నిర్మాణాలకు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. గ్రామ పంచాయతీల్లో ఈజీఎస్‌లో భాగంగా ఇప్పటికే పలు నిర్మాణాలు చేపట్టినప్పటికీ ఖర్చు చేసిన నిధులు అందలేదని పలువురు వాపోతున్నారు.

త్వరగా ప్రారంభించాలి



ఇప్పటికే భవనాలు మంజూరైన విషయాన్ని సర్పంచ్‌లకు సూచించాం. వారు త్వరగా పనులు ప్రారంభించాలి. వెంటనే అన్నింటిని ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. 40శాతం మెటీరియల్ కంపోనెంట్ నిధులు వచ్చేలా చర్యలు తీసుకుంటాం.

– స్టీవెన్, పీఆర్ ఏఈ, కెరమెరి

డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న ఆత్రం భుజంగరావు

తిర్యాణి: అగ్ని ప్రమాదంలో ఇండ్లు కోల్పోయిన బాధిత కుటుంబాలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు మంజూరు చేయాలని మానవహక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని సల్పలగూడ గ్రామానికి చెందిన బాధితులను శనివారం ఆయన పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ రోడ్డున పడ్డ బాధిత కుటుంబాలను ప్రభుత్వాలు అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆత్రం సుగుణ, కనక వెంకటేశ్వర్‌రావు, మర్సుకోల జ్ఞానేశ్వర్, కుడుమెత గుణవంత్‌రావు, విశ్వనాథ్, లింగు, రాధాబాయి, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్ర విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

ఆసిఫాబాద్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం జనగామ జిల్లా పాలకుర్తి నుంచి ప్రారంభించే పాదయాత్రను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పాదయాత్ర పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యాయన్నారు. ఈ నెల 28న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద పాదయాత్ర ముగుస్తుందని తెలిపారు. సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు మోరేశ్వర్, జిల్లా సహాయ కార్యదర్శి రాజేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, నాయకులు నగేశ్, శంకర్, పుష్పలత పాల్గొన్నారు.

మాలీ సంఘ నాయకుల సంబరాలు



కౌటాల: క్షీరాభిషేకం చేస్తున్న మాలీ కులస్తులు



కెరమెరి: సంబరాలు చేసుకుంటున్న నాయకులు

కౌటాల: సీఎం కేసీఆర్ మాలి కులస్తులకు ఇచ్చిన హామీ మేరకు అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేయడం హర్షనీయమని మాలి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదే వసంత్‌రావ్ అన్నారు. నాయకులు స్థానిక మాలి సంఘం భవనంలో శనివారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సంఘం మండల అధ్యక్షుడు నికోడే గంగారం, సర్పంచ్ ఆదే శ్రీనివాస్, నాయకులు నాందేవ్, జ్యోతిరావ్, భీంరావు, శంకర్, రాము, నారాయణ, గిర్మాజీ, మోతిరాం, జైరాం, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూర్: మండల కేంద్రంలో శనివారం మాలి కులస్తులు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొట్రంగి రామకృష్ణ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. కేసీఆర్ చిత్రపటంతో పాటు సిర్పూర్(టి) ఎమ్మెల్యే కోనేరు కోనప్ప చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. మాలి సంఘం మండల అధ్యక్షుడు ఆడె అశోక్, సంఘం నాయకులు మోహన్, భీమన్న, మధునయ్య, తిరుపతి, గోపాల్, టీఆర్‌ఎస్ పార్టీ యూత్ మండల అధ్యక్షుడు నరేందర్ గౌడ్, నాయకులు జావిద్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: మాలీలను ఎస్టీ జాబితాలో చేర్చాలని సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసిన నేపథ్యంలో మండల మాలీ సంఘం నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సంఘం మండలాధ్యక్షుడు కావుడే తుల్సిరాం మాట్లాడుతూ గతంలో ఎన్నో ప్రభుత్వాలు వచ్చినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఆదే శ్యాంరావు, వాడై సుభాష్, వాడై సోమ, మనోహర్, చందు, భీంరావు, బుదాజి, శంకర్, సుభాష్, నారాయణ, బాలాజి, శివరాం, అశోక్ తదితరులు ఉన్నారు.

'అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు'



పోలీస్‌స్టేషన్‌లో సంఘం నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఇందురావు అన్నారు. శనివారం 317జీవోతో నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు ముందస్తు అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఆయన మాట్లాడుతూ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని, డిమాండ్లు నెరవేరే వరకు పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జాదవ్ కిరణ్, హేమంత్, ఉషన్న, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

హమారా ప్రసాద్‌ను కఠినంగా శిక్షించాలి



గోలేటిలో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

రెబ్బెన: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్‌పై పీడీ యాక్ట్ నమోదు చేయాలని అంబేద్కర్ యువజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ప్రసాద్ వ్యాఖ్యలకు నిరసనగా శనివారం గోలేటి టౌన్‌షిప్ సింగరేణి బస్టాండ్ వద్ద ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. వివిధ సంఘాల నాయకులు రవీందర్, సంతోష్, బాపురావు, ఉపేందర్, ప్రభాకర్, అసీఫ్, శంకర్, శ్రీధర్, క్రాంతి, వెంకటేష్, తిరుపతి, సతీష్, సోమయ్య, సికిందర్ పాల్గొన్నారు.

చింతలమానెపల్లి: అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్‌ను కఠినంగా శిక్షించాలని మండల బౌద్ధ సంఘం అధ్యక్షుడు ముడిమడుగుల నర్సయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేస్తూ ప్రసాద్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంకటేష్, హరీష్, చేతన్, సదాశివ్, పాపయ్య, దుబ్బుల వెంకన్న, అశోక్, మురళి, దివాకర్, మోహన్‌రావు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల ఆధ్వర్యంలో శనివారం కాగజ్‌నగర్ డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి హమారా ప్రసాద్ చిత్రపటాన్ని దహనం చేశారు. సమతా సైనిల్‌దళ్ జిల్లా ఇన్‌చార్జి జాడి దిలీప్‌కుమార్, కౌన్సిలర్ డోంగ్రి సునీల్, బీఎస్‌ఎస్ అధ్యక్షుడు జాడి శివరాం, నాయకులు సిరిపురం సదాశివ్, దుర్గం తిరుపతి, నాందేవ్, రవీంద్రనాథ్, విలాస్, శ్రీనివాస్, రమేశ్, వసంత్‌రావు, గోవర్ధన్, విలాస్, చరణ్‌దాస్, గణేశ్, దేవాజీ, పిల్లల తిరుపతి, బాబులాల్ తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి): అంబేద్కర్ వ్యక్తిగత జీవితం గురించి సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసి అవమాన పర్చిన ప్రసాద్‌ను పోలీసులు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ శనివారం మండలంలోని బౌద్ధ మహా సంఘం, అంబేద్కర్ సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మహా సంఘం మండల అధ్యక్షుడు రాజు, హుడ్కిలి సర్పంచ్ ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి తిరుపతి, బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీన్‌కుమార్ పాల్గొన్నారు.

కౌటాల: అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని మహార్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ర్యాలీ తీశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మహాసభ సంఘం మండల అధ్యక్షుడు బండురావు, నేతకాని సంఘం మండల అధ్యక్షుడు జానకిరావ్, సంఘం నాయకులు వెంకటేశ్, అశోక్, మోహన్‌లాల్, దేవాజీ, మారుతి, మధుకర్, తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముతో పరేషాన్..!



వాంకిడి మండల కేంద్రంలో పొగమంచును తలపిస్తున్న దుమ్ము

- ఇబ్బందులు పడుతున్న మండలవాసులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు
- నాలుగు వరుసల రహదారి పనుల్లో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం

వాంకిడి: మండలంలో కొనసాగుతున్న నాలుగు వరుసల రహదారి నిర్మాణంలో సదరు కాంట్రాక్టర్ నియమ నిబంధనలు గాలికి వదిలేశారు. పర్యావసానంగా మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారి పనులు చేపట్టే ముందు ఇరువైపులా ప్రజల రాకపోకలకు అనుకూలంగా బీటీ రోడ్డు నిర్మించాల్సి ఉంటుంది. కానీ ఒకవైపు మాత్రమే బీటీ రోడ్డు నిర్మించి మరోవైపు నాసిరకం మట్టితో రోడ్డు నిర్మించి వదిలేశారు. దీంతో నిత్యం ఆ వైపు ఒక కిలోమీటర్ పొడవున ఆ ప్రాంతమంత దుమ్ముతో నిండిపోతుంది. నాలుగు నెలల నుంచి ఇదే పరిస్థితి ఉండగా స్థానికులు ఎన్నోమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతోంది. వాహనాల రాకపోకలతో పొగ మంచును తలపించే దుమ్ముతో దోస్తీ కట్టాల్సి వస్తుందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. దీంతో అనారోగ్యాల బారిన పడాల్సి వస్తుందని వాపోతున్నారు. ఇకనైనా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

వైఎస్సార్‌టీపీ మండల అధ్యక్షుడి తొలగింపు

ఆసిఫాబాద్: వైఎస్సార్‌టీపీ ఆసిఫాబాద్ మండల అధ్యక్షుడు ఆసాల సుధాకర్‌ను పదవి నుంచి తొలగిస్తున్నట్లు వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు గోవింద్ నాయక్ బుక్యా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నందున రాష్ట్ర స్థాయి నేతల ఆదేశాల మేరకు తొలగించినట్లు తెలిపారు. త్వరలోనే కొత్త అధ్యక్షుడిని నియమిస్తామని పేర్కొన్నారు.

రాజీతోనే కేసులు పరిష్కారం

ఉట్నూర్‌రూరల్: రాజీతోనే కేసులు సులువుగా పరిష్కారం అవుతాయని ఉట్నూర్ సివిల్ జడ్జి దుర్గారాణి అన్నారు. శనివారం సివిల్ కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్, న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఎన్నో ఏళ్ల నుంచి కోర్టులలో పెండింగ్ ఉన్న కేసులను పరిష్కారించడానికి లోక్ అదాలత్ ఉపయోగపడుతుందన్నారు. కోర్టుల చుట్టూ తిరిగే కక్షిదారులు రాజీపడడం ఉత్తమమన్నారు. అనంతరం చట్టాలపై అవగాహన కల్పించారు. బార్ అసోషియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి

ఆదిలాబాద్‌అర్బన్: గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములు పట్టాలివ్వాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకులు జగన్ సింగ్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పోడు భూములకు పట్టాల పేరుతో కుట్రలు పన్నుతుందన్నారు. అటవీ హక్కుల చట్టాన్ని నీరుగార్చే విధంగా సీఎం కేసీఆర్ ప్రసంగం ఉందన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజల అవసరాలకు ఉపయోగకరంగా లేదన్నారు. సమావేశంలో కుమ్ర అశోక్, మెస్రం శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌అర్బన్: పోడు భూములకు ప్రభుత్వం కల్పిస్తున్న హక్కు రాజ్యాంగ హక్కు అని, సీఎం కేసీఆర్ బిక్ష కాదని కాంగ్రెస్ అధికార ప్రతినిధి పసుల చంటి ప్రకటనలో అన్నారు. అసెంబ్లీలో సీఎం కేసీఆర్ చేసిన ప్రకటన అహంకార పూరితంగా ఉందన్నారు. గిరిజనులకు సీఎం కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అడవిపై ఆధారపడిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలను అడవి నుంచి గెంటి వేయడానికి కేసీఆర్ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు.

'ఆదివాసీలకు అన్యాయం'

బేల: అన్ని కులాలను ఎస్టీలో కలిపితే ఆదివాసీలకు అన్యాయం జరుగుతుందని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షుడు ఆడ శంకర్ అన్నారు. శనివారం ఆదివాసీ జేఏసీ సమావేశంలో మాట్లాడారు.